సాక్షి నిజామాబాద్

బుధవారం ॥ 15 ॥ మార్చి ॥ 2023



పనులు వేగవంతం చేయాలి

వర్ని మండలంలోని జాకోరా లిఫ్ట్ పనులు నెమ్మదించడంపై అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 8లో ▸



దారి దోపిడీ కలకలం

డ్రైవర్‌పై తుపాకీ గురిపెట్టి, కత్తులతో దాడి చేసి కంటైనర్‌ను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన జిల్లాలో కలకలం రేపింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7 /21.4

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కక వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

24 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి, మూడో సెమిస్టర్స్, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించి ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మార్చి 24 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: తన పుట్టినరోజు సందర్భంగా రహదారులు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మార్యదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎంకు పుష్ప గుచ్ఛం అందించి ఆశీర్వాదం పొందారు.

ఇంటి ఇలవేల్పుకు ఎమ్మెల్సీ కవిత పూజలు



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని సీహెచ్ కొండూరులో గల ఎమ్మెల్సీ కవిత ఇంటి ఇలవేల్పు శ్రీ రాజ్యలక్ష్మి సహిత లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ పూజలు నిర్వహించారు. ముందుగా చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మేయర్ నీతూ కిరణ్, మహిళా సంక్షేమ శాఖ చైర్మన్ ఆకుల లలిత, నుడా చైర్మన్ ప్రభాకర్, స్థానిక సర్పంచులు ప్రభాకర్, రామడ పోశెట్టి, ఎంపీటీసీలు ధాత్రిక రాజు, మనోజ్ రావు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయండి

- ములుగు ఎమ్మెల్యే సీతక్క



ఖలీల్‌వాడి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా ములుగు ఎమ్మెల్యే సీతక్కను డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంగళవారం తన ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడారు. రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఈ రెండు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ రెండు ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి



మోపాల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 15 ఏళ్ల పాటు ఉద్యోగి జీతాన్ని తీసుకొని అన్యాయం చేసిన విషయంలో సదరు ఉద్యోగి కొడుకు ఫారుక్ మంగళవారం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లపాటు తన తండ్రి జీతం తీసుకోవడమే కాకుండా సర్వీస్‌బుక్‌లు మాయం చేశారని ఫారుక్ ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పోరాటం చేయాలని కోరారు. ఇటీవల 'సాక్షి'లో '15 ఏళ్ల జీతం అప్పనంగా మెక్కేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది.

పేదల బతుకులు ఆగం

- బాజిరెడ్డిని జైల్‌లో పెట్టాలి
- డిచ్‌పల్లి కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



డిచ్‌పల్లి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల బతుకులు ఆగమయ్యాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా మంగళవారం డిచ్‌పల్లిలోని బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్యార్థులకు ఉద్యోగాలు లేవని, మహిళలకు వడ్డీలేని రుణాలు లేవని, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్ల పెంపు ఏమైందని ప్రశ్నించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను చర్లపల్లి జైలుకు పంపించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు పీఆర్సీ ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులు 60 రోజులు సమ్మె చేయగా వారిలో 50 మంది చనిపోయారన్నారు. వీరి చావుకు బాధ్యుడిగా బాజిరెడ్డి గోవర్ధన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన జిల్లా ఎమ్మెల్యేల పేరు చెబితే ప్రజలు వెంటబడి తరిమికొట్టే దుస్థితి దాపురించిందన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, షకీల్‌లు తమ కొడుకులు, తమ్ముళ్లతో కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కమీషన్ల కోసమే రీడిజైన్లు

కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం రీడిజైన్లు చేసిందని ఆయన ఆరోపించారు. 0.84 టీఎంసీల సామర్థ్యం కలిగి 1.84లక్షల ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్ చేసిన కొండెం చెరువు పనులను రూ. 900 కోట్లతో 75 శాతం పైగా పూర్తి చేశారన్నారు. ఇంకా రూ. 300 కోట్లు ఖర్చు చేస్తే రిజర్వాయర్ పనులు పూర్తయితే పొలాలకు నీరందేదన్నారు. కేవలం కమీషన్ల కక్కుర్తితోనే సీఎం కేసీఆర్ 3.5 టీఎంసీలకు పెంచి 10 గ్రామాలను, 10వేల ఎకరాలను ముంచేందుకు రూ. 3,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. భూములు కోల్పోతున్న రైతులు ప్రశ్నిస్తే వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. రైతుల భూముల జోలికొస్తే బీఆర్ఎస్‌ను రాజకీయంగా సమాధి చేయాలన్నారు. తక్షణమే భూసేకరణ నిలిపి వేయాలన్నారు. రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం చేస్తామన్నారు. వర్సిటీల్లో అధ్యాపకులు, సిబ్బంది లేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

సోనియా, రాహుల్ గాంధీల నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పెద్ద దొంగ అని, ఆయన కూతురు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో జిల్లా మహిళల పరువు తీసిందన్నారు. కాంగ్రెస్ గరీబోళ్ల పార్టీ అని నిజామాబాద్ ప్రజలు విలక్షణ తీర్పుతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపించడం ఖాయమన్నారు.

వైఎస్సార్ హయాంలోనే జిల్లా అభివృద్ధి

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి నోచుకుందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం ఆధారంగా ఉన్న జిల్లాకు సాగు నీటి ప్రాజెక్టులను మంజూరు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత జిల్లాలో అభివృద్ధి శూన్యమని, ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రతో..

2003 వైఎస్సార్ పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన విధంగానే 2023లో రేవంత్ రెడ్డి పాదయాత్రతో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ అర్వింద్‌లు జిల్లా అభివృద్ధి కోసం చేసింది శూన్యమన్నారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో కనీసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయించలేకపోయారని విమర్శించారు.

బైబై.. కేసీఆర్..!

ఇందిరమ్మ రాజ్యం రావాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5లక్షలు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ. 5 లక్షలకు పెంపు, రైతులకు ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ, దీపం పథకం కింద రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం బై.. బై.. కేసీఆర్ అంటూ అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ కార్యదర్శి నగేశ్‌రెడ్డి, నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, అమృతాపూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సమస్యలపై చర్చకు సిద్ధమా..

- బాజిరెడ్డికి రూ. 300 కోట్ల ఆస్తులు ఎక్కడివి
- అభివృద్ధిపై చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి సవాల్
- ఎమ్మెల్యేపై చార్జ్‌షీట్ విడుదల



చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న భూపతిరెడ్డి

మోపాల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి కి రూ. 300 కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సమస్యలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంగళవారం మోపాల్‌లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మంచిప్ప రీడిజైన్‌ను కేవలం కమీషన్ల కోసమే రూపొందించారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, మొరం, భూకబ్జా, బెల్ట్‌షాపుల్లో బాజిరెడ్డికి వాటాలు ఉన్నాయని ఆరోపించారు. కమలాపూర్, జక్రాన్‌పల్లి, కొత్త కలెక్టరేట్, బైపాస్ రోడ్డు, జూబ్లీహిల్స్, గండిపేట్, చౌటుప్పల్ లో భూములు, ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు, ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత డీజిల్‌లో రెండు శాతం, పాత బస్సులు అమ్మిన దానిలో ఐదు శాతం, 400 కొత్త బస్సుల కొనుగోళ్లలో 10 శాతం కమీషన్ తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రతి గ్రామంలో అన్ని కులసంఘాలకు రూ. 200 కోట్ల ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని, గెలిచిన తర్వాత ఎన్ని సంఘాలకు ఇచ్చారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఈ చార్జీషీట్‌పై బహిరంగ చర్చకు సవాలు విసుతున్నామని, డిచ్‌పల్లి బస్టాండ్‌లోనే చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. రూ. 300కోట్ల ఆస్తులు ఉన్న మాట నిజమని.. తప్పు అని నిరూపిస్తే తాను రాజకీయాలను వదులుకుంటానని నిరూపించకపోతే రాజీనామా చేస్తావా అని సవాల్ విసిరారు.

పాతాళానికి గంగమ్మ..

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- సగటున మీటరు లోతుకు పడిపోయిన నీళ్లు
- చీమన్‌పల్లిలో 12.17 మీటర్లు కిందికి..



జిల్లా కేంద్రంలోని దుబ్బలో గల ఫీజోమీటరు ద్వారా వాటర్ లెవల్స్‌ను కొలుస్తున్న అధికారి

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): గత వానాకాలంలో 60 శాతం ఎక్కువ వర్షాలు కురిసినప్పటికీ జిల్లాలో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వేసవి మొదట్లోనే పలు మండలాల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. జిల్లా వ్యాప్తంగా ఆరు గ్రామాల్లో భారీ లోతుకి వెళ్లాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో బోర్లు వట్టిపోతున్నాయి. ఫిబ్రవరికి సంబంధించిన గ్రౌండ్ వాటర్ రిపోర్టును భూగర్భ జలశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లా వ్యాప్తంగా సగటున ఒక మీటరు లోతుకి జలాలు పడిపోయినట్లు గుర్తించారు. అయితే, వ్యవసాయానికి అధిక మొత్తంలో నీటిని వినియోగించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 82 ఫిజోమీటర్లు ఉన్నాయి. వీటి ద్వారా గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రతినెలా వాటర్ లెవల్స్‌ను కొలుస్తారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తీసిన లెక్కలను చూస్తే ప్రతినెలా భూగర్భ జలాలు తగ్గుతూ వస్తున్నాయి. 47 ఫిజో మీటర్లలో పది మీటర్ల లోపల నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. 19 ఫిజో మీటర్లలో 10–15 మీటర్లు, తొమ్మిది ఫీజో మీటర్లలో 15–20 మీటర్లు, అలాగే ఏడు ఫీజో మీటర్లలో 20 మీటర్లపైన జలాలున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఆరు గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితి

జిల్లాలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు మరింత లోతుకి వెళ్లడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే అత్యధికంగా సిరికొండ మండలం చీమన్‌పల్లిలో 12.17 మీటర్ల లోతుకి నీళ్లు జారిపోగా ప్రస్తుతం 25.77 మీటర్లలో నీళ్లున్నాయి. ఇదే మండలంలోని పాకాల గ్రామంలో 8.21 మీటర్లు కిందికి పడిపోగా ప్రస్తుతం 24.84 మీటర్ల లోతులో నీరు ఉంది. గడ్కోల్‌లో 6.94 మీటర్లు పడిపోగా ప్రస్తుతం 23.10 మీటర్ల లోతులో నీళ్లున్నాయి. ముషీర్‌నగర్‌లో 5.30 మీటర్లు పడిపోగా ప్రస్తుతం 22.36 మీటర్ల నీటిమట్టం ఉంది. దీంతో సిరికొండ మండలంలో చాలావరకు బోరుబావులు వట్టిపోయాయి. పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. భీమ్‌గల్ మండలంలోని గోనుగొప్పులలో 2.68 మీటర్లు కిందికి పడిపోగా ప్రస్తుతం 25.79 మీటర్లలో, తాళ్లపల్లిలో 1.61 మీటర్లు పడిపోగా, 20.86 మీటర్లలో నీళ్లున్నాయి. ఇవే కాకుండా చాలా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీల్లో బోర్లకు నీరందడం లేదు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి



మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- సకాలంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్‌షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. సామాజిక బహిష్కరణలు విధిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సీపీ నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరఫున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, ఏసీపీలు కిరణ్ కుమార్, ప్రభాకర్, కిరణ్ ఆర్డీవోలు రవి, శ్రీనివాస్, డీటీడబ్ల్యూవో నాగూరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్ పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా!

- పార్కు స్థలాన్ని ఆక్రమించిన రిటైర్డు టీపీవో
- సహకరించిన మున్సిపల్ అధికారి



పార్కు స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు వేసిన దృశ్యం

నిజామాబాద్‌నాగారం: కంచే చేను మేసిన చందంగా మారింది నగరంలోని మున్సిపాలిటీ అధికారుల తీరు. మున్సిపాలిటీకి సంబంధించిన ఓ పార్కు స్థలాన్ని ఓ రిటైర్డు టీపీవో ఆక్రమించారు. ఇందుకు ప్రస్తుతం మున్సిపాలిటీలోని ఓ అధికారులు సహకరించినట్లు తెలిసింది. ఇంకేముంది సదరు రిటైర్డు టీపీవో దర్జాగా 200లకు గజాల భూమిలో షెడ్డు వేసుకుని వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు.

39వ డివిజన్‌లో..

నగరంలోని 39వ డివిజన్‌లో గల న్యూఎన్జీవోస్ కాలనీలో ఉన్న గీతాంజలి స్కూల్ వెనుక భాగంలో పార్కు స్థలంపై ఓ రిటైర్డు టీపీవో కన్నుపడింది. తన భవనంలో అద్దెకు ఉంటున్న ఓ మున్సిపల్ అధికారి సహకారంతో దర్జాగా కబ్జా చేసేశారు. సదరు రిటైర్డు టీపీవో తన సొంత భూమి మాదిరిగా ఏకంగా వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి షెడ్డు వేసుకున్నారు. దర్జాగా వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. పైగా ఈ షెడ్డుకు ఓ ఇంటి నంబర్ రాసి పెట్టడం అనుమానాలకు తావిస్తుంది. ప్రభుత్వ భూములు, పార్కులు కాపాడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

విలువ రూ. 60 లక్షలపైనే..!

ఈ ప్రాంతంలో భూముల ధరలు గజానికి సుమారుగా రూ. 30వేల నుంచి రూ. 40వేలకు పైగా ఉంటుంది. గజం రూ. 30వేలు అనుకున్నా 200గజాలకు రూ. 60లక్షల పైనే విలువ ఉంటుంది. ప్రభుత్వం ద్వారా జీతాలు తీసుకొని పార్కు స్థలం కబ్జా చేయడంపై నగరవాసులు మండిపడుతున్నారు. భూమిని ఆక్రమించిన రిటైర్డు అధికారి, సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని, పార్కు స్థలాన్ని కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు.

నేడు మంత్రి కేటీఆర్ రాక



సాక్షి, కామారెడ్డి: మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. 11.30 గంటలకు నిజాంసాగర్ మండలం గర్గల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం మంజీర నదిపై నిర్మించి నవంతెనను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు నాగమడుగు ఎత్తిపోతల పథకానికి జక్కాపూర్ వద్ద శంకుస్థాపన చేస్తారు. 12.30 గంటలకు పిట్లం మండలం అన్నారం గ్రామానికి చేరుకుని అక్కడ భోజనం చేస్తారు. అనంతరం ఒంటిగంటకు పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 2.30 గంటలకు పిట్లం నుంచి హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షలకు హాజరు కానున్న 35,017 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



నగరంలోని ఓ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నిజామాబాద్‌అర్బన్: నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా ఇంటర్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 35,017 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 17,503 మంది, సెకండియర్ విద్యార్థులు 17,514 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కాలేజీలు, రెండు సాంఘిక సంక్షేమ కళాశాలలు, ఏడు మోడల్ స్కూల్ కాలేజీలు, రెండు మైనారిటీ రెసిడెన్షియల్స్, 25 ప్రైవేటు కాలేజీల్లో పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు.

స్క్వాడ్‌ల ఏర్పాటు

ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు రవాణా సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఘటనలు, మాస్ కాపీయింగ్ జరగకుండా జిల్లాలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఎనిమిది మంది సిటింగ్ స్క్వాడ్‌లను, హై పవర్ కమిటీ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 08462–295452ను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ టీంలు అందుబాటులో ఉంటాయి.

క్లుప్తంగా

శిక్షణ శిబిరానికి ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం (15న) న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న నిరుద్యోగిత శిక్షణ శిబిరానికి తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎంపికైనట్లు కోఆర్డినేటర్ కే రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.సుమలత (గిరిరాజ్ కళాశాల), బి అంజయ్య (సౌత్‌క్యాంపస్, భిక్కనూర్) ఎంపికైనట్లు తెలిపారు. శిబిరంలో 19 నుంచి 29 ఏళ్ల యువతి, యువకుల స్థితిగతులపై శిక్షణనిస్తారని తెలిపారు.

జమీల్ అహ్మద్‌కు జాతీయ అవార్డు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ జమీల్ అహ్మద్‌కు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నవ్య ఫౌండేషన్ సంస్థ 'రాష్ట్రీయ శిక్షక్ రత్న సమ్మాన్' జాతీయ అవార్డును ప్రదానం చేసింది. జమీల్ అహ్మద్‌ను వీసీ డి రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని అభినందించారు.

మెండోరాలో కుక్కల స్వైరవిహారం

- 13 మందిపై దాడి



గాయపడిన రాజవ్వ

బాల్కొండ: మెండోరాలో మంగళవారం ఉదయం వీధికుక్కలు 13 మందిపై దాడి చేశాయి. ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని చికిత్స చేయించుకున్నారు. వీరిలో గుండెటి రాజవ్వకు, బిల్లిష్ బేగంలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ మెండోరా ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తామన్నారు.

సౌత్‌క్యాంపస్ అధ్యాపకుడికి పదోన్నతి

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో తొలి అసోసియేట్ ప్రొఫెసర్‌గా జియో ఇన్ఫర్‌మెటిక్స్ అధ్యాపకుడు డాక్టర్ సుధాకర్‌గౌడ్ పదోన్నతి పొందారు. దీంతో మంగళవారం సుధాకర్‌గౌడ్‌ను అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు.

లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- జాకోరా ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- పనులు నిలిచిపోవడంతో అధికారులపై ఆగ్రహం



ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: మండలంలోని జాకోర వద్ద నిజాంసాగర్ ప్రధాన కాలువపై నిర్మిస్తున్న జాకోర లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కుంటుపడటంపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎత్తిపోతల పథకం పనులను స్పీకర్ పోచారం పరిశీలించారు. పది రోజులుగా పనులు నడవకపోవడంతో అధికారులపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ నాన్ కమాండ్ ఏరియా రైతులకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మిస్తున్న లిఫ్ట్‌పై నిర్లక్ష్యం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులకు హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు లిఫ్ట్ పనులను పర్యవేక్షిస్తూ ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ప్రజలు నిర్మించాలని అప్పుడే పనుల్లో నాణ్యత ఉంటుందన్నారు. స్థానిక అవసరాల మేరకు పనులను నాణ్యతగా వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జాకోర గ్రామానికి మంజూరై, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షులు గిరి, నాయ కులు గణేష్, సాయిలు, హన్మాండ్లు, సత్తార్ పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

చందూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండలంలోని మేడిపల్లిలో పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. లక్ష్మాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. స్పీకర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నూతన భవనాల నిర్మాణానికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. వర్ని ఏఎంసీ చైర్‌పర్సన్ మూడు కవిత అంబర్ సింగ్, లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

వర్ని మండలంలోని శంకరాలో కంటి వెలుగు శిబిరాన్ని స్పీకర్ మంగళవారం ప్రారంభించారు. ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ట్రాన్స్‌కో ఏఈ తీరుకు నిరసనగా ధర్నా



మాధవపల్లి వద్ద ధర్నా చేస్తున్న జువ్వాడి గ్రామస్తులు

- ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్

గాంధారి: మండలంలోని జువ్వాడి గ్రామస్తులు గాంధారి ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌రెడ్డి తీరుకు నిరసనగా మంగళవారం ధర్నా చేశారు. గ్రామంలో తాగునీటి కోసం ఇటీవల బోరు వేశారు. గ్రామంలో వృథాగా ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను బోరు వద్ద ఏర్పాటు చేసుకొని కనెక్షన్ తీసుకుంటామని గ్రామస్తులు ఏఈని కోరారు. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పడంతో గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్ కో సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి రూ.1.42 లక్షలు అవుతుందని డీడీ కడితే బోరు మోటారుకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. పంచాయతీలో అంత డబ్బు లేదని, కనెక్షన్ ఇవ్వాలని కోరారు. ఏఈ అలా కుదరదని చెప్పడంతో గ్రామస్తులు వృథాగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను బోరు వద్దకు తరలించారు. అయినా ఏఈ దానికి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులు ధర్నా చేశారు. సదాశివనగర్ సీఐ రామన్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పి ట్రాన్స్‌కో డీఈ, ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడించారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ కనెక్షన్ ఇవ్వాలని ఏఈని ఆదేశించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సినీ ఫక్కీలో లారీ చోరీ

- 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు
- ఒకరి అరెస్ట్, పరారీలో మరో నలుగురు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

కామారెడ్డి క్రైం : సినీ ఫక్కీలో లారీని చోరీ చేసిన నిందితులను సదాశివనగర్ పోలీసులు 24 గంటల్లో గుర్తించారు. వారిలో ఒకరిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. మంగళవారం ఎస్పీ శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మెదక్‌కు చెందిన రమేశ్ గౌడ్ తన లారీలో చెరుకు నింపుకొని ఈనెల 12న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి వచ్చాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అన్‌లోడ్ చేసి గ్రామానికి తిరిగి వెళ్తుండగా అడ్లూరు ఎల్లారెడ్డి సమీపంలో స్కార్పియో వాహనంలో ఐదుగురు వచ్చి లారీని ఆపారు. రమేశ్ గౌడ్‌ను లారీలోంచి కిందకి దించారు. కళ్లల్లో కారం చల్లి చితకబాదారు. తర్వాత అతడిని రోడ్డు పక్కన పడేసి లారీతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలను పరిశీలించి విచారణ ప్రారంభించారు. సోమవారం రాత్రి లారీని మహారాష్ట్రలోని ఓ ప్రాంతంలో గుర్తించారు. లారీ దోపిడీ ఘటనలో నిందితుల్లో ఒకడైన మహారాష్ట్రలోని ముఖ్కేడ్‌కు చెందిన తలికాటి విట్టల్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నారన్నారు. వారిని కూడా తొందరలోనే అరెస్టు చేస్తామన్నారు. లారీతో పాటు స్కార్పియో వాహనం, ఓ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి గురైన లారీని 24 గంటల వ్యవధిలోనే గుర్తించి కేసు పరిశోధనలో విశేషంగా కృషి చేసిన సీఐ రామన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అరెస్టయిన నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.

యువకుడి బలవన్మరణం

తాడ్వాయి: తాను ప్రేమించిన బాలికను కలవొద్దని పెద్దలు కట్టడి చేయడంతో తాడ్వాయి మండలంలోని ఓ గ్రామానికి చెందిన టేకుల మల్లేశ్ (23) బలవన్మరణం చెందాడు. యువకుడు మంగళవారం గ్రామ శివారులోని పొలంలో గల చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

యాత్రకు ఘనస్వాగతం



పాదయాత్రలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క

మోపాల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర మంగళవారం మోపాల్ మండలంలో కొనసాగింది. యాత్రకు గ్రామ గ్రామాన ఘనస్వాగతం లభించింది. ముందుగా మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించి పాదయాత్రను ప్రారంభించారు. కంజర, కులాస్‌పూర్, కులాస్‌పూర్ తండా మీదుగా డిచ్‌పల్లి మండలం ముల్లంగికి చేరింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. పాదయాత్రలో చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. రేవంత్‌రెడ్డి వెంట ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, తాహెర్ బిన్, నగేష్‌రెడ్డి, గంగారెడ్డి, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

ఇందూరు తిరుమలలో పూజలు

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల ఆలయంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ధర్మకర్తలు దిల్‌రాజు, నర్సింహారెడ్డి వివరించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



చిన్నారులకు చాక్లెట్లు ఇస్తున్న రేవంత్‌రెడ్డి



కులాస్‌పూర్‌లో వృద్ధులతో మాట్లాడుతూ..



నర్సింగ్‌పల్లి ఇందూర్ తిరుమల వద్ద రేవంత్‌రెడ్డి

కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి



బోధన్‌టౌన్: ఆల్ ఇండియా ఫిట్‌నెస్ ఎక్స్‌పో 2023 ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో బోధన్ పట్టణానికి చెందిన జైనాబ్ ఫాతీమా గోల్డ్ మెడల్ సాధించింది. పోటీల్లో ఫాతీమా ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిందని కరాటే మాస్టర్ జుబేర్ తెలిపారు.

దక్షిణ భారత ఉమెన్ లీగ్‌లో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: దక్షిణ భారత ఉమెన్ లీగ్ ఖేలో ఇండియా సైక్లింగ్ ట్రాక్ పోటీలల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి శిల్పా చౌహాన్‌కు మూడు పతకాలు వచ్చాయి. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పోటీలు జరిగాయి. ఇందులో శిల్పాచౌహాన్ రెండు కాంస్య పతకాలు, ఒక రజత పతకం సాధించింది. క్రీడాకారిణిని సైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జనరల్ మనిందర్‌పాల్‌సింగ్ అభినందించారు.

బల్దియా కార్మికుడిపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లి హోల్‌సేల్ ఫ్రూట్ షాపు మార్కెట్‌లో నిర్వాహకుడు బల్దియా కార్మికుడిపై దాడికి పాల్పడినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌కుమార్ తెలిపారు. చెత్త సేకరించడానికి టిప్పర్ డ్రైవర్‌తోపాటు కార్మికులు వెళ్లారు. టిప్పర్‌లో చెత్త నిండిపోవడంతో డ్రైవర్ జస్వీర్ సింగ్ చెత్తను తీసుకు వెళ్తుండగా ఫ్రూట్ షాపు యాజమాని అబ్దుల్ హసద్‌తోపాటు వర్కర్స్ దాడికి పాల్పడ్డారు. జస్వీర్‌సింగ్ గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

ఇద్దరు మహిళల బైండోవర్

గాంధారి: నాటు సారా తయారు చేస్తున్న ఇద్దరు మహిళలను మంగళవారం బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. మండలంలోని పంతులు నాయక్ తండాకు చెందిన గుగులోతు బుజ్జి, గండివేట్ తండాకు చెందిన రమావత్ మీరా సారా తయారు చేస్తున్నారని ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షకీర్ అహ్మద్ బైండోవర్ చేశారని తహసీల్దార్ తెలిపారు.

నిందితుల రిమాండ్

సిరికొండ: హత్యాయత్నం కేసులో నిందితులను రిమాండ్ చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. మండలంలోని దుప్య తండాలో మాలావత్ గోవింద్‌పై బుక్యా మురారి, బుక్యా రవి, బుక్యా రమేష్ హత్యాయత్నం చేశారని చెప్పారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కమ్మర్‌పల్లి: బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన తిగుర్ల లింబాద్రి(57) ఈ నెల 10న ఉప్లూర్ రోడ్‌లోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. వడ్డెర కాలనీ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న గంగా జలందర్ (33) మంగళవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మండలంలోని పడకల్ శివారులో ఈ నెల 12న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో మోపాల్ మండలం ఠాణకుర్దు గ్రామానికి చెందిన గంగాజలందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గంగాజలందర్ మంగళవారం నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

నగల కోసం మహిళ హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

వర్ని: మహిళను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన బురిగేడి సైదవ్వ(55)ను ఆభరణాల కోసం చంపేసినట్లు బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్బర్‌నగర్‌కు చెందిన సైదవ్వ ఈ నెల 4న వర్నిలోని బస్టాండ్ పక్కన గల కల్లు దుకాణంలో కల్లు తాగుతోంది. ఆ సమయంలో బొమ్మనదేవ్‌పల్లికి చెందిన అల్‌పిల్లి అశోక్, గిర్మి లక్ష్మి ఆమెతో మాట కలిపారు. ఇంటి వద్ద దింపుతామని చెప్పి సైదవ్వను టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఎక్కించుకొని వెళ్లారు. మార్గమధ్యలో ఆమెకు మద్యం తాగించి నస్రుల్లాబాద్ శివారులో హత్య చేశారు. ఆమె మెడలోని రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేల విలువగల వెండి ఆభరణాలను తీసుకొని మృతదేహాన్ని నిజాంసాగర్ కాలువలో పడేశారు. కాలువలో మృతదేహం గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఆభరణాలు కోసం హత్య చేసినట్లు గుర్తించి, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఆభరణాలు రికవరీ చేసి, రిమాండ్‌కు పంపామన్నారు. సమావేశంలో రుద్రూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో దొంగల హల్‌చల్

- జాతీయ రహదారి పక్కన దుకాణాల్లో చోరీ
- రూ.58 వేల నగదు అపహరణ



రాజ్‌వీర్ ఆటోమొబైల్స్ షెట్టర్‌ను తెరిచిన దృశ్యం



సీసీ ఫుటేజీలో నమోదైన నిందితులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న లక్ష్మీనరసింహ ట్రేడర్స్, మెడీలైఫ్ ఫార్మసీ, రాజ్‌వీర్ ప్రైజెస్(ఆటోమొబైల్స్) దుకాణాల షెట్టర్లను పైకి లేపి దొంగతనానికి పాల్పడ్డారు. లక్ష్మీనరసింహ ట్రేడర్స్‌లోని కౌంటర్‌ను తెరిచి అందులో ఉంచిన రూ.8 వేలు నగదు, రాజ్‌వీర్ ఆటోమొబైల్స్‌లో రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. మంగళవారం వేకువజామున భక్తులు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తుండగా, దుకాణాల షెట్టర్లు కొంత భాగం తెరిచి ఉండడం చూసి యజమానులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి వైపు నుంచి అర్ధరాత్రి 2:30 గంటలకు వచ్చి చోరీకి పాల్పడ్డారు. రాజ్‌వీర్ ఆటోమొబైల్స్‌లో కౌంటర్ తాళాన్ని స్క్రూ డ్రైవర్‌తో తీసి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. కౌంటర్‌పై పెట్టిన బ్యాగులో పెద్ద మొత్తంలో నగదు ఉన్నప్పటికీ దొంగలు గమనించలేదు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. కాగా దొంగలు ఎటువంటి ఉపకరణాలు లేకుండా తేలికగా దుకాణాల షెట్టర్లను పైకి లేపడం గమనార్హం.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

రెంజల్: మండలంలోని సాటాపూర్ చౌరస్తా వద్ద బైక్‌పై నుంచి పడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్ గ్రామానికి చెందిన కుమ్మరి రాంబాయి(70) మంగళవారం నవీపేట్ మండలం నాగేపూర్‌లోని తన చెల్లెలు ఇంటి వద్దకు వచ్చింది. అక్కడి నుంచి తన సోదరితో కలిసి ఆమె కుమారుడు సాయిలు బైక్‌పై మహారాష్ట్రలోని బెల్లూర్‌లో గల బంధువుల ఇంటికి బయలుదేరారు. సాటాపూర్‌లో స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనకాల కూర్చున్న రాంబాయి ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరు గాయాపడ్డారు. మృతురాలి భర్త పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

డీసీఎం ఢీకొని ఒకరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన చెల్ల పెద్ద సాయిలు(52) మృతి చెందాడు. టీ తాగి వస్తానని ఇంట్లో నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లిన సాయిలును ఒడ్డెరకాలనీ నుంచి సోమేశ్వర్ వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. దీంతో డీసీఎం డ్రైవర్ వాహనాన్ని వదిలిపారిపోయాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ బాన్సువాడకు చెందిన నూరోద్దీన్ అని తెలిసింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: రైలులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లాలో మంగళవారం జరిగింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో రైలు పట్టాల పక్కన ఓ మృతదేహం ఉందని సమాచారం రావడంతో రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని ఎస్సై తావు నాయక్ తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు, వివరాలు లభించలేదన్నారు. రైలు తలుపు దగ్గర ప్రయాణిస్తూ జారి పడి మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. ఎవరైనా అతడిని గుర్తిస్తే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డబ్బుల కోసం తల్లిపై దాడి

భిక్కనూరు: డబ్బుల కోసం తల్లితో గొడవపడి కల్లు సీసాతో దాడి చేశాడో కొడుకు. ఈ ఘటన మంగళవారం మండలంలోని జంగంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై ఆనంద్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాగని సత్తవ్వ తన కుమారుడు అశోక్‌తో కల్సి నివసిస్తుంది. శుక్రవారం ఉదయం డబ్బుల విషయమై తల్లి కొడుకులు గొడవ పడ్డారు. డబ్బులు ఇవ్వకపోవడంతో అశోక్ ఇంట్లో ఉన్న కల్లు సీసాతో సత్తవ్వ వీపుపై దాడిచేశాడు. దీంతో సత్తవ్వకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే గ్రామస్తులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

కారు నడుపుతుండగా ఛాతీలో నొప్పి

నవీపేట: నవీపేట మార్కండేయ ఆలయ సమీపంలో మంగళవారం కారులో వెళ్తున్న బోధన్ మండలం సంగెం గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డికి ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న ఓ యువతిని, పోలీస్‌స్టేషన్ ప్రహరీని ఢీకొంది. ప్రమాదంలో యువతికి స్వల్ప గాయాలు అయ్యాయి.

దారి దోపిడీ కలకలం

- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఘటన
- బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌లో ఖాళీ కంటైనర్, డ్రైవర్‌ను వదిలి పారిపోయిన దుండగులు



డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



శ్రీరాంపూర్ వద్ద వదిలి వెళ్లిన కంటైనర్

బాల్కొండ: తుపాకీ ఎక్కు పెట్టి, కత్తులతో డ్రైవర్‌ను పొడిచి ఓ కంటైనర్‌లోని హల్దీరాం ప్రొడక్ట్స్‌ను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఈ దారి దోపిడీ జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వైపు హల్దీరాం ప్రొడక్ట్స్‌తో వస్తున్న కంటైనర్‌ను ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ వద్ద 44వ జాతీయ రహదారిపై తెల్లకారులో వచ్చిన ఏడుగురు దుండగులు ఆపారు. డ్రైవర్ ప్రఫుల్ ఆనంద్‌రావు తలపై గన్ పెట్టి బెదిరించారు. కత్తులతో దాడిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. దుండగులు కంటైనర్‌ను తీసుకెళ్లి ప్రొడక్ట్స్‌ను ఖాళీ చేసి నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం శ్రీరాంపూర్ వద్దకు తీసుకువచ్చి ఖాళీ కంటైనర్‌ను, డ్రైవర్‌ను వదిలి పారిపోయారు. డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. యూపీకి చెందిన దోపిడీ దొంగల ముఠా సభ్యుల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.